జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 19 | నవంబర్ | 2024 ◆ పేజీలు : 6

## జిల్లా వైజ్ఞానిక సదస్సును ప్రారంభించిన ఎంపీ రఘురామిరెడ్డి



ఆకట్టుకున్న ప్రాజెక్టులు

**చంద్రుగొండ, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలం గురుకుల కళాశాలలో జిల్లా వైజ్ఞానిక సదస్సును ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సోమవారం అశ్వరావుపేట శాసనసభ్యులు ఆదినారాయణ


మిగతా 2 లో...

ఆదివాసుల ఆస్తులపై బడా బాబుల కన్ను...

పదవుల ఆశ చూపిస్తూ... ఆస్తులకు ఎర వేస్తున్న వైనం

సర్పంచ్ గా గెలిపించి 2 ఎకరాల భూమి కైవసం చేసుకునే ప్రయత్నం





# పదవులు మీకు.. ఆస్తులు మాకు...

2 లో..

అమాయక ఆదివాసులకు పదవుల వ్యామోహం కల్పించి వాళ్ళ ఖరీదైన ఆస్తులను లాక్కునే దిశగా కొందరు బడా నేతలు మమేకమయ్యారు. సాధారణ సర్పంచ్ పదవులపై ఆశ కల్పించి 2 ఎకరాల పొలంను తమ వశం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అసలు ఆ కుటుంబానికి పదవులపై ఎలాంటి ఆసక్తి లేకపోయిన .. ''కమ్మ''ని మాటలతో ఈ ''వర్గం'' అటువైపుగా మల్లించి 16 లక్షలు ఖర్చు చేసమంటూ కబుర్లు చెబుతుంది. ఈ బడా బాబు పన్నిన వలలో చిక్కిన ఆ ఆదివాసీ కుటుంబం చివరికి ఆత్మరక్షణ కోసం ఆరాటపడుతుంది. లక్ష్మిదేవిపల్లి మండలంలోని సాటివారిగూడెంలో జరుగుతున్న ఈ ఉదాంతం జిల్లా ప్రజలను ఉల్లికిపడేలా చేస్తుంది.



◆ భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

## స్టడీ అవర్స్ పై ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ ఉండాలి

–గిరిజన దర్బార్ లో ఐటీడీఏ పీవో రాహుల్



**భద్రాచలం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి ):** గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహణపై ప్రత్యేకాధికారులు, హెచ్ఎంలు, వసతిగృహాల వార్డెన్ల పర్యవేక్షణ ఖచ్చితంగా ఉండాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏలో గిరిజన దర్బార్ నిర్వహించి గిరిజన గ్రామాల నుంచి గిరిజనులు తీసుకువచ్చిన అర్జీలను పీవో రాహుల్ స్వీకరించి తన పరిధిలో సమస్యలను వెంటనే పరిష్కరించి మిగిలిన వాటిని అధికారులకు పంపి పరిష్కరించేలా చూడాలన్నారు. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో నివసించే నిరుపేద గిరిజన కుటుంబాలకు జీవనోపాధి కల్పించడానికి ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడమే ఐటీడీఏ లక్ష్యమన్నారు. ట్రైకార్ ద్వారా సబ్సిడీ రుణాలు, పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాల రుణాలు, పట్టాభూములకు రైతుబంధు,

మిగతా 2 లో...

## ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలని గవర్నర్ కు వినతి

3 లో..

## ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా...?



దేశంలోనే తొలి ప్రయోగాత్మక ప్లాంట్

రోజుకు 500 కేజీల కార్బన్ డయాక్సైడ్ నుండి 180 కేజీల మిథనాల్ తయారీ

కోల్ ఇండియా , ప్రైవేట్ సంస్థలతో కలిసి ఏర్పాటు

ప్రయోగం సఫలం అయితే భారీ మిథనాల్ యూనిట్ స్థాపనకు సంసిద్ధం

డిసెంబరు 31 నాటికి పూర్తి : సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్

## సింగరేణిలో కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు

**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 18 ( ప్రజాజ్యోతి ):** పర్యావరణరహిత చర్యలకు పెట్టింది పేరుగా ఉన్న సింగరేణి సంస్థ మరో వినూత్న వ్యాపార విస్తరణ ఆవిష్కరణకు రంగం సిద్ధమైందని సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ తెలిపారు. సోమవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిసారిగా కార్బన్ డయాక్సైడ్ వాయువు నుంచి మిథనాల్ ను ఉత్పత్తి చేసే ప్రయోగాత్మక ప్లాంటును సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఆధారంగా కంపెనీ ఏర్పాటు చేస్తోందని అన్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో బొగ్గును మండించగా వెలువడే వాయువు నుండి రోజుకు 500 కేజీల పరిమాణం గల కార్బన్ డయాక్సైడ్ ను సేకరించి, దీనిని హైడ్రోజన్ వాయువుతో కుదింపు చేసి, చివరిగా మిథనాల్ ద్రవాన్ని పొందే ప్రక్రియను ఈ ప్లాంట్ లో చేపట్టనున్నారు. ఈ ప్రయోగాత్మక ప్లాంట్ నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందని, డిసెంబర్ 31 నాటికి

మిగతా 2 లో...

## కొత్తగూడెం పట్టణం మెరిసేలా..ప్రజలు మురిసేలా అభివృద్ధి చేస్తా

**ప్రజల మౌలిక వసతుల కల్పనపై ద్రుష్టి సారించాం**

**మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి జరుగుతోంది**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



*కొత్తగూడెం మునిసిపాలిటీ / నవంబర్ 18 (ప్రజాజ్యోతి) :* ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కొత్తగూడెం పట్టణం మెరిసేలా.. ఇక్కడి ప్రజలు మురిసేలా అభివృద్ధి చేసి మరింత స్ఫూర్తితో ముందుకు సాగుతానని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 16, 18, 21, 22వ వార్డులో రూ.1.70కోట్ల డిఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న నిర్మాణం పనులకు శంకుస్థాపన, 17, 19వార్డుల్లో రూ.2.20కోట్లతో పూర్తయిన నిర్మాణాలను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్బంగా ఏర్పాటైన సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ ప్రజల మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక ద్రుష్టి సారించామని, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 36వార్డుల్లో వివిధ పథకాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పథకాలు, విద్యుత్ వంటి అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నామని, ప్రజలకు గెలుపు ఫలాలు అందించడమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. నిర్లక్ష్యానికి గురైన కొత్తగూడెం నియోజకవర్గాన్ని మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నామని, విద్య, వైద్యం, విద్యుత్, రవాణా సౌకర్యం అంశాలపై ప్రేత్యేక ద్రుష్టి సారించామన్నారు. జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రజలు ద్రుష్టి సారించాలని, అధికారులు పనులను నిత్యం పర్యవేక్షించాలని, నాణ్యత లోపిస్తే చర్యలకు సిఫారసు చేస్తానని, సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కమిషనర్ శేషాంజన్ స్వామి, డిప్యూటీ తహసీల్దార్ అంజద్ పాషా, డి ఈ రవికుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ చౌహన్, విదుత్ శాఖ అధికారులు, కౌన్సిలర్లు మాచర్ల రాజకుమారి, జి.కళ్యాణి, పి సత్యనారాయణాచారి, బండి నర్సింహా రావు, సత్యవతి, టి రాజ నళిని జయంతి, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, స్థానికులు, నాయకులు జి.నగేష్, మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, పల్లపోతు సాయి, బత్తుల నాగరాజు, పైడిపల్లి లక్ష్మి, పోతు పురుషోత్తం, సత్యనారాయణ, ధన్రాజు, సర్వేశ్వర్ రావు, రాజేందర్, అమన్, ఇర్ఫాన్, జహీర్, అజయ్, సతీష్ తదితరములు పాల్గొన్నారు.

## ద్వంసమైన డ్రైనేజీని పరిశీలించిన ఎమ్మెల్యే

**నాణ్యతాలోపంవల్లే డ్రైనేజి ద్వంసమైంది**

**అధికారుల పర్యవేక్షణలోపంతో ప్రజాధనం వృధా**

*కొత్తగూడెం మునిసిపాలిటీ / 18నవంబర్ (ప్రజాజ్యోతి ):* మున్సిపాలిటీ పరిధిలోని 21వ వారు మేదరబస్తీలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన డ్రైనేజి ద్వంసం అవడంతో స్థానికుల ఫిర్యాదుమేరకు కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సోమవారం ద్వంసమైన డ్రైనేజీని పరిశీలించారు. డ్రైనేజి పుననిర్మాణంకోసం సత్వరమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. డ్రైనేజి దుస్థితిపై మున్సిపల్ శాఖ అధికారులను మందలించారు. కూనంనేని మాట్లాడుతూ నిర్మాణంలో నాణ్యత లోపించడం వల్లే డ్రైనేజి ద్వంసమైందని, ఇది ముమ్మాటికీ అధికారుల్లో పర్యవేక్షణలోపం, కాంట్రాక్టర్ల అవినీతికి పాల్పడటం వల్లే లక్షలాది రూపాయల ప్రజాధనం వృధా అయిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు జరిగినా ఉపేక్షించేదిలేదన్నారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, అధికారులు వున్నారు.



# పదవులు మీకు... ఆస్తులు మాకు....

*భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి / 18నవంబర్ (ప్రజాజ్యోతి ):*

**పథకం ప్రకారం....**

అప్పటి వరకు మండలంలోని చాత కొండ ఉమ్మడి పంచాయతీగా ఉండేది. 2019 గ్రామపంచాయతీ ఎన్నికలలో దీనిని 3 గ్రామ పంచాయతీలుగా విభజించి ఎస్టి రిజర్వేషన్ గా ఖరారు చేశారు. అప్పటికీ ఈ గ్రామంపై పట్టున్న ఓ సామాజిక వర్గానికి సంబంధించిన కొందరు గ్రూప్ గా ఏర్పడి ఆదివాసులకు పదవుల వ్యామోహాన్ని కల్పించారు. ఖర్చు ఎంతైనా పరువాలేదు మొత్తం తామే భరిస్తామని ముందుకు వచ్చి టిఆర్ఎస్ పార్టీ తరుపున వకాలత్ పుచ్చుకున్నారు. స్థానికంగా ఉంటున్న వారిలో విలువైన ఆస్తులు ఉన్నవారిని ఎన్నుకుని పోటీలో నిలిపారు. అప్పటికే ఈ పంచాయతీల పైన పట్టున్న ఈ వర్గానికి తమ అభ్యర్థుల గెలుపు ఈజీగా దక్కింది. అయితే ఇందులో భాగంగా అదే సమయంలో సాటివారిగూడెం సర్పంచ్ అభ్యర్థిగా పోటి చేసిన పూనెం సంధ్య ఇంటి సభ్యుల వద్ద నుండి కొన్ని కాగితాల పైన సంతకాలు సేకరించారు. అత్యున్నత సామాజిక వర్గం వారు వీరితో కలివిడిగా ఉండడంతో ఈ కుటుంబం నమ్మి సంతకాలకి వెనుకాడకుండా పెట్టసాగారు. ముందే ప్రణాళికతో ఉన్న ఈ వర్గం కొంతకాలం వేచి చూసి వీరి కార్యాచరణకు పదును పెట్టసాగారు.

**ప్రణాళిక ప్రారంభం....**

ఆదివాసి ఆస్తులపై కన్నేసి ముందస్తుగానే సంసిద్ధంగా ఉన్న ఈ వర్గం వాళ్ళ ప్రణాళికకు పదును పెట్టారు. ఆ ఇంటి యజమానురాలు వజ్జ పాపమ్మ పేరుతో ఉన్న సర్వే నెంబర్ 53/1లోని రెండు ఎకరాల భూమిని తమకు సంబంధించిన వారికి అమ్మకాలు జరిపించినట్లు తప్పుడు పత్రాలను సృష్టించి ఆ భూమిలో తిష్ట వేసేందుకు ప్రయత్నించారు. అప్పటికీ మోసపోయామని గ్రహించిన ఈ కుటుంబం తమ శక్తి మేర వారించారు. కాని ఆర్థిక , అంగబలం ఉన్న బడా బాబుల ముందు నిలువలేక పోయారు. ఏం చేయాలో పాలుపోని క్రమంలో న్యాయస్థానమే దిక్కంటూ మొదటిగా భద్రాచలంలోని ఓ లాయర్ తో మాట్లాడి ఐటిడిఏ కోర్టులో దావా వేశారు. తదుపరిగా కొత్తగూడెం, ఖమ్మం కోర్టులను ఆశ్రయించారు. ఈ మూడింటిలోనూ వీరికి చుక్కెదురు అయ్యింది. వాళ్ళ తరుపున వకాలత్ తీసుకున్న లాయర్లు వక్రబుద్ధిని చూపించారు. దీంతో చేసేదేమిలేక ప్రస్తుతానికి హైకోర్టులో పోరాడుతున్నారు. అయితే ఈ అంశం మొదలునుంచే ఈ ఆదివాసి కుటుంబం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటుంది. పోలీస్ స్టేషన్లు రెవిన్యూ కార్యాలయాలు, కోర్టులు, పంచాయతీల చుట్టూ తిరుగుతూ నరకయాతన అనుభవిస్తుంది. 2019 మునుపు సంతోషంగా గడిపిన వీరికి ఓ సామాజిక వర్గం నేతలు పన్నిన కుట్ర, పదవి వ్యామోహానికి గురయ్యి అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివాసి కుటుంబం ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం మాత్రం దక్కడం లేదు.

**వ్యవస్థలో ఎన్ని మార్పులు వచ్చినా..**

వ్యవస్థలో ఎన్ని మార్పులు వచ్చినా ...ఎంత వేగంగా అభివృద్ధి చెందిన.. అగ్రకుల వర్ణాల వారి తెలివితేటలు ముందు అణగారిన వారి జీవితాలు ఇంకా కొట్టుమిట్టాడుతూనే ఉన్నాయి. రాజ్యాంగం ఎన్ని హక్కులు కల్పించిన.. వాటి అమలుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకున్న.. వాస్తవిక పరిస్థితులు మాత్రం వీటికి భిన్నంగానే ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికై ఎన్నో రిజర్వేషన్లు, పథకాలు, ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసిన వాటినీ ప్రత్యామ్నాయంగా ఏర్పరచుకొని బడా బాబులుగా ఉన్న కొందరే వృద్ధి చెందుతున్నారు. కల్లబొల్లి మాటలతో మచ్చిక చేసుకుని, చిన్నాచితక పదవి వ్యామోహం చూపిస్తూ.. వారి భూములను లాక్కోవడం, ప్రభుత్వాల నుంచి హక్కులకై వస్తున్న సబ్సిడీలను మారుపేరులతో లబ్ధి పొందడం ఇప్పటికీ నిత్యకృత్యాలుగా జరుగుతూనే ఉన్నాయి. మాట విన్నవారికి తాత్కాలిక పూలసోపానం.. విననివారిపై అఘాయిత్యాలు, వీరి కుటిల డిక్షనరీలో రోజువారి పార్యాంశాలు. అయితే వీరి అక్రమ ఆగడాలకు కళ్లెం వేసి నివారించే బాధ్యత తమపై ఉన్న.. కొంతమంది అధికారులు మాత్రం అవన్నీ మరిచి బడా బాబులకే వత్తాసు పలకడం శోచనీయం. జిల్లాలోని లక్ష్మీదేవి పల్లి మండలం లో గత కొంత కాలంగా జరుగుతున్న బడా బాబుల మోసపూరిత చర్యలు ముందు నలిగిపోతున్న ఓ ఆదివాసి కుటుంబ పరిస్థితికి ఈ ఉదాంతం ప్రత్యక్షంగా అద్దం పడుతుంది.

## సింగరేణిలో కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి...)

పూర్తవుతుందని తెలియజేశారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో బొగ్గు మండించగా వచ్చే కర్బన ఉద్గారాలను 99.9 శాతం వరకు వాతావరణంలో కలవకుండా నివారించడం కోసం ఇ.ఎస్.పీ. (ఎలక్ట్రో స్టాటిక్ ప్రెసిపిటేటర్స్) ను నెలకొల్పడం జరిగిందన్నారు. ఈ విధానంలో చివరిగా వాతావరణంలోకి అనుమతించబడిన వాయువు నుండి మాత్రమే ఈ కార్బన్ డయాక్సైడ్ వాయువును స్వీకరించడం జరుగుతుందన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ చిమ్నీకి అనుబంధంగా ఈ ప్రయోగాత్మక ప్లాంట్ నిర్మాణం జరుగుతోందన్నారు.

**పూర్తయిన సివిల్ నిర్మాణాలు: ఈనెలలో యంత్రాల ఏర్పాటు :**

కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ తయారు చేసే ప్లాంట్ లో ఇప్పటికే సివిల్ నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో కార్బన్ డైయాక్సైడ్ను సంగ్రహించే యూనిట్ ను, హైడ్రోజన్ జనరేషన్ యూనిట్ ను, కంప్రెషన్ యూనిట్ ను, మిథనాల్ డిస్టిలేషన్ యూనిట్ ను ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. ఈ యంత్ర విభాగాలలో కొన్ని ఇప్పటికే నిర్మాణ ప్రాంతానికి చేరుకోగా మరికొన్ని ఈ నెలాఖరుకు చేరుకోనున్నాయని పేర్కొన్నారు.

**సింగరేణి సౌజన్యంతో, నిర్మాణ సారథ్యంలో :**

సింగరేణి సౌజన్యంతో, నిర్మాణ సారథ్యంలో కోల్ ఇండియా అనుబంధ రీసర్చ్ యూనిట్ అయిన సీఎంపిడిఐఎల్ వారి ఆర్థిక సహకారంతో, ఈ ప్లాంట్ నిర్మాణం చేపట్టడం జరిగింది. నిర్మాణ బాధ్యత మరియు ప్లాంట్ నిర్వహణను బెంగళూరుకు చెందిన జవహర్లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ సైంటిఫిక్ రీసెర్చ్ మరియు బ్రెత్ అప్లైడ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి అప్పగించడం జరిగింది. ఈ ప్లాంట్ నిర్మాణానికి సుమారు 20కోట్ల రూపాయల ఖర్చు కానుంది.

**మిథనాల్ తో బహువిధ వ్యాపార ప్రయోజనాలు**

ఈ ప్రయోగాత్మక ప్లాంటు ప్రారంభమైన తర్వాత రోజుకు 180కేజీల మిథనాల్ తయారు జరగనుంది. ప్రస్తుతం దీనిని ఎవరికీ విక్రయించబోవడంలేదని తెలిపారు. ప్రయోగం విజయవంతం అయితే పెద్ద ఎత్తున మిథనాల్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సింగరేణి సంసిద్ధంగా ఉంది. మిథనాల్ ను ఎరువుల తయారీలో, అక్రిలిక్ ప్లాస్టిక్, సింథటిక్ ఫైబర్ వస్త్రాల తయారీలో, ప్లైవుడ్, పెయింట్స్ తయారీలో కూడా విస్తృతంగా వినియోగిస్తారు. కనుక వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా పెద్ద ఎత్తున మిథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేసి, ఈ మిథనాల్ ను వివిధ పరిశ్రమలకు సింగరేణి సంస్థ అమ్ముకునే అవకాశం ఉంది. దేశీయ అవసరాల కోసం వినియోగిస్తున్న 120 మిలియన్ టన్నుల మిథనాల్ లో దాదాపు 80 మిలియన్ టన్నులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. దేశీయంగా ఉత్పత్తి దిశగా ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతం అయితే అది భవిష్యత్తో ఏర్పాటు చేసే ప్లాంట్ల ద్వారా దేశానికి ఎంతో ఆర్థికంగా ఎంతో లబ్ధి చేకూర్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

## జిల్లా వైజ్ఞానిక సదస్సును ప్రారంభించిన ఎంపీ రఘురామిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి...)



అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను పరిశీలించి వారిని అభినందించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. సోమ మంగళ బుధవారాలలో వైజ్ఞానిక సదస్సు కొనసాగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి తెలిపారు. జిల్లా నలుమూలల నుండి విద్యార్థులు పలు రకాల ప్రాజెక్టులను ప్రదర్శించి వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జగపతి రాజు, వరంగల్ నియోజకవర్గస్థాయి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, సోషల్ వెల్ఫేర్ జోనల్ అధికారి ని స్వరూపారాణి ఎంఈఓ ఏం సత్యనారాయణ హాజరు కాగా నాయకులు, ప్రముఖులు ,గ్రామ పెద్దలు నాగ సీతారాములు, పరస వెంకటి, భోజ్యానాయక్, ఫజల్ భక్ష్, హాజరయ్యారు.

## స్టడీ అవర్స్ పై ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ ఉండాలి

(మొదటి పేజీ తరువాయి...)

జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థికసాయం, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక సాయం, గురుకులం సీట్లు, పై చదువులకు ఆర్థికసాయం కోసం అర్జీలు వచ్చినట్లు తెలిపారు. గిరిజన దర్బార్లో వచ్చిన అర్జీలు ఆన్లైన్ చేయించి ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేసి ప్రతి గిరిజన కుటుంబానికి విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్ , డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్ఓసీ రవీంద్రనాథ్, గురుకులం ఆర్సీవో నాగార్జునరావు, ఏవో రాంబాబు, ఎస్పీవ భాస్కరన్, ఏపీవో పవర్ ఏఈ మునీర్పాషా, డీటీఆర్ వోఎస్ఆర్ లక్ష్మి నారాయణ, కొండరెడ్ల విభాగం అధికారి మణిధర్, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణరావు, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం విభాగం మణికుమారి, హెచ్ఐవో లింగానాయక్, జీసీసీ మేనేజర్ జయరాజ్, ఐసీడీఎస్ సూపర్వైజర్ అనసూర్యలు పాల్గొన్నారు.

# ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలని గవర్నర్ కు వినతి

**ఇల్లందు / నవంబర్ 18, ప్రజాజ్యోతి:**



ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆదివాసి జెఏసి జిల్లానాయకులు పెండెకట్లయాకయ్య సోమవారం రాష్ట్ర గవర్నర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలగాణ రాష్ట్రంలో ఆదివాసుల పరిస్థితి దుర్భరంగా ఉందని, పూర్తి స్థాయిలో విద్య, వైద్యం సదుపాయం అందుబాటులో లేక ఎంతోమంది ఆదివాసులు నిరాశ్రయులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రహదారి సదుపాయాలు, పోడు భూముల సమస్య, కొమరం భీమ్ పెద్ద విగ్రహం, కొమరం భీమ్ మ్యూజియం, గ్రంథాలయం, ఐఏఎస్, ఐపిఎస్ చదువుల కోసం జిల్లా కేంద్రాలలో స్టడీ సెంటర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో పూర్తిగా విద్యా వైద్యం అందుబాటులో లేక సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమతలేక ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని అన్నారు. చదువుకునే ఆర్థిక స్తోమత లేక చదువుకోలేని పరిస్థితిలో చదువు నిష్పత్తి పడిపోతున్నదని పేర్కొన్నారు. వైద్యం అందని పరిస్థితిలో గర్భిణీ స్త్రీలకు కూడా ఎలాంటి రహదారి సౌకర్యం లేక చప్టలలో తీసుకొని కాడే కట్టుకొని పోతున్నారని, సరైన అంబులెన్స్ సదుపాయాలు అందుబాటులో లేవన్నారు. వర్షాకాలంలో సరైన బ్రిడ్జి మార్గంలేక రాకపోకలు కూడా ఇబ్బందికి గురవుతున్నారని, ఆదివాసులు సాగు చేసుకుంటున్న పోడు భూములు 2005కు ముందుసాగు చేసుకుంటున్నపోడు భూములను కూడా ఫారెస్ట్ అధికారులులాక్కొని ట్రంచ్ కొట్టిఆదివాసులకు భూములు మీద హక్కు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు మీద ఆధారపడిన ఆదివాసులకి మనిషికి 5 ఎకరాలు ఏర్పాటు చేసేలా ఫారెస్ట్ అధికారులను కోరారు. ఆదివాసులకు ముఖ్యంగా విద్యా, వైద్యం అందుబాటులోకి తేవాలని, చదువుకోలేని ఆర్థిక సోమత లేని ఆదివాసులకు ప్రభుత్వమే బాధ్యత వహించి ప్రభుత్వమే అన్ని సౌకర్యాలు కల్పించాలని, పోడు భూముల సమస్యను పరిష్కరించి ప్రతి ఒక్కరికి ఐదు ఎకరాలు కల్పించాలని, ఖమ్మం జిల్లా విశిష్టత దాని యొక్క నైసర్గిక స్వరూపాన్ని బట్టి అక్కడ ఆదివాసుల ప్రాంతం ఎక్కువగా ఉన్నందున పురాతన చరిత్రకు సంబంధించి, విద్యార్థులకు అందుబాటులో అన్ని సదుపాయాలు కలిగిన జిల్లా గ్రంధాలయం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని కోరారు.

# ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా...?

**★విద్యార్థులు స్కూల్ కి వెళ్ళాలంటే భయపడుతున్నారు.**

**★ ఇలా కొనసాగితే విద్యార్థుల చదువు అటకెక్కడం ఖాయం: గూనూరి రమణ**

**చర్ల / నవంబరు 18, (ప్రజాజ్యోతి ):**




తెలంగాణ రాష్ట్రంలో ఇసుక ద్వారా వస్తున్న సంపాదన కు రాష్ట్ర పాలకులు అడ్డగోలు పర్మిషన్ లిస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని తెలిసినా ఇవేమీ పట్టనట్లుగా పాలకులు పాలన సాగిస్తున్నారని, ప్రజల ప్రాణాలతో పాటు విద్యార్థుల భవితవ్యం కూడా ప్రశ్నార్థకంగా మారిందని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు గూనూరి రమణ అన్నారు. సోమవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూూ కొత్తగూడెం జిల్లా చర్ల మండలం సి.కత్తిగూడెంపంచాయతీలో ప్రభుత్వనిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఇసుక రాంపులపై తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కత్తి గూడెం పంచాయితీ జిపి.పల్లిలో యం.పి.పి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ముందునుండి తిరుగుతున్న వందల కొద్ది లారీలను చూసి ప్రాణాలకు భయపడి విద్యార్థులను పాఠశాలకు పంపనటువంటి పరిస్థితి కనిపిస్తుంది. అలాగే ఇసుక లారీలు వలన వచ్చే దుమ్ము, ధూళి పాఠశాల ఆవరణలో పిల్లలు తినే అన్నములో పడి తినడానికి కి చాలా ఇబ్బందికరంగా మారిందని , దాదాపు 1000 కి పైగా లారీలు కత్తి గూడెం ఇసుకరాంపులో ఉంటున్నట్లు ఆయన తెలిపారు . ఇసుక లారీల వలన రోడ్లు మొత్తం గుంతలు గుంతలు పడి వేరే వాహనాలు తిరగనటువంటి పరిస్థితి నెలకొందని, అధికారులు జేబులు నింపుకొని ఇసుక రాయుళ్ళకు పర్మిషన్లు ఇచ్చి ఇవాళ పట్టించుకొనటువంటి పరిస్థితి కనిపిస్తోందని,ఈ ఇసుక రాంపులో ఒక మంత్రి మరియు ఎంఎల్ఏ పాత్ర కీలకంగా ఉన్నందున మైనింగ్ అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇదేవిధంగా కొనసాగితే ఆ ప్రాంత ప్రజలు విద్యార్థులు చాలా కోల్పోవలసి వస్తుందని విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి కనపడుతోందని ఆయన అన్నారు.ఆ ఇద్దరు రాజకీయనాయకులు సొమ్ముకి ఆశపడి ప్రజల ప్రాణాలు కూడా లెక్కచెయ్యకుండా వారి జేబులు నింపుకుంటున్నారని ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. అలాగే గోదావరి చుట్టుపక్కల ఉన్న వందల ఎకరాల భూమికి అటుగా వెళ్తున్న ఇసుక లారీల వల్ల పడే దుమ్ము ధూళి తో పంట నష్టం భారీగా జరిగే అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు కూలీలు,కూలీలను తరలిస్తున్న వాహనాలు,ప్రజలు భిక్కు భీక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది.కనుక ఈ విషయాన్ని దృష్టి లో ఉంచుకొని ఉదయం ఆరు గంటల నుండి పదిన్నర వరకు అలాగే సాయంత్రం ఐదు గంటలకునుంచి ఏడు గంటలవరకు లారీలు ఆపినట్లైతే అటు విద్యార్థులు స్కూలుకు వెళ్లే సమయం ఇటు రైతు కూలీలు పొలాలకు వెళ్లే సమయంలో వెసులుబాటు కలుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు చొరవ చూపించి ప్రజలకు విద్యార్థులకు మేలు జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# వనభోజన మహోత్సవాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

**ఇల్లందు, నవంబర్ 18, ప్రజాజ్యోతి:**



కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఇల్లందు ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్ ల సంయుక్త నిర్వహణలో రొంపేడు దగ్గరలోని సైదులు మామిడి తోటలో ఈనెల 17న వనభోజన మహోత్సవ వేడుకలకు అధిక సంఖ్యలో హాజరైన ఆర్య వైశ్యులకు వనసమారాధన కార్యక్రమ అధ్యక్షుడు కండె రమేష్, ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సుబ్బారావు, కోశాధికారి యెలుగూరి మధుబాబులు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉదయం నుండి సాయంత్రం వరకు సత్యనారాయణ వ్రతం, వన్ మినిట్ గేమ్స్, సినీతంబోలా, మిమిక్రీ, మ్యాజిక్ షో, డాన్సులు లాంటి వివిధ రకాలైన వినోద కార్యక్రమాల మధ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నడుమ వారి సమయాన్ని ఎంతో సంతోషంగా గడిపారన్నారు. గత 15 రోజుల నుండి ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్ ల ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని ఆర్యవైశ్య కుటుంబాల అందరి సహకారం తీసుకొని ఈ వనభోజనాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ వనభోజనాలు విజయవంతమైనందున నిర్వహణ కమిటీకి సహకరించిన ఆర్యవైశ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్ లు నిర్వహించే ప్రతి కార్యక్రమానికి ఇదే విధంగా తమ సహకారాన్ని అందించాలని కోరారు. వన భోజనాలు విజయవంతం చేసినందుకు వనభోజన నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులకు ఇల్లందు మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, వాసవి క్లబ్ అధ్యక్షులు పుల్లూరు సతీష్ కుమార్ లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఐఎన్టియుసి సెంట్రల్ కమిటీ జనరల్ సెక్రటరీగా గోచికొండ

**ఇల్లందు / నవంబర్ 18, ప్రజాజ్యోతి:**




ఐఎన్టియుసి సెంట్రల్ కమిటీ జనరల్ సెక్రటరీగా గోచికొండ సత్యనారాయణను ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు డా. జి. సంజీవ రెడ్డి, సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ లు సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలకుగాను 135 మందితో సెంట్రల్ కమిటీ ప్రకటించారు.ఎల్లప్పుడూ కార్మికుల హక్కుల సాధన యూనియన్ బలోపేతం కోసం కృషిచేయాలని కోరారు. ఈ సందర్భంగా గోచికొండ మాట్లాడుతూ సెంట్రల్ కమిటీలో తనకు అవకాశం కల్పించినందుకు అగ్రనాయకత్వానికి, సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టినందుకు యూనియన్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషిచేస్తానని స్పష్టం చేశారు.

# పొడు భూముల సమస్యల పరిష్కరించాలని కలెక్టర్ కు వినతి




**ఇల్లందు టౌన్ / నవంబర్ 18, ప్రజాజ్యోతి:**

పోడువ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నవారి పోడు భూముల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఆదివాసి నాయకుడు, అడ్వకేట్ సూర్ణపాక సత్యనారాయణ సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పోడు రైతుల జీవనోపాధి అయిన పోడు భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్ల శ్రీను, ఎట్టి హరికృష్ణ, ఆదూరి రవి, అప్పల మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం మండల నూతన కన్వీనర్ గా ఈసం నరసింహారావు

**మహాసభ లో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని తీర్మానాలు**

**టేకులపల్లి, నవంబర్ 18, ప్రజాజ్యోతి:**



భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు టేకులపల్లి మండల నూతన కన్వీనర్ గా ఈసం నరసింహారావు ను మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ తెలిపారు, సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టేకులపల్లి లో జరిగిన సిపిఎం మండల ఏడవ మహాసభలో నూతన కన్వీనర్ గా ఈసంనరసింహారావు, కమిటీ సభ్యులుగా కడుదుల వీరన్న, పూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్ ,కుంజ రమేష్, దనసరి వీరాస్వామి, దొడ్డ సావిత్రి, దొడ్డ సంపత్, పాయం వెంకన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మహాసభలో ప్రజా సమస్యలపై చర్చించుకుని పోరాటాలు చేయాలని తీర్మానాలు చేసి కమిటీ ఆమోదించిందన్నారు,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల సాగు దారులకు పెండింగ్ లో ఉన్న పట్టాలు ఇవ్వాలి. త్రీ ఫేస్ విద్యుత్, సాగునీటి బోర్లు, రైతు బంధు, రైతు బీమా ఇవ్వాలని, కోయ గూడెం ఓసి 2, ఫిట్ –2,3 లో భూములు కోల్పోయిన గిరిజన నిర్వాసితులకు గౌరవ హైకోర్టు తీర్పు అమలు జరిపి నష్టపరిహారం,భూమి, ఉద్యోగాలు ఇవ్వాలని, జాతీయ రహదారి విస్తరణ లో భూములు,ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ఎకరానికి 40లక్షల నష్టపరిహారం చెల్లించాలని, సీతారామ ప్రాజెక్టు పాత డిజైన్ ద్వారా నిర్మించి గోదావరి నీళ్ళు టేకులపల్లి మండలానికి తీసుకురావాలని, ముర్రేడు వాగునీళ్ళు గడ్డిచెరువు, తెల్లవాగు చెరువుకు మళ్ళించాలని,రెవెన్యూ,జంగుసిపాయి, సీలింగ్, అసైన్డ్ భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని, రైతు బంధు, రైతు బీమా ఇవ్వాలని, టేకులపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుకై తీర్మానాలు చేసినట్లు ఆయన తెలిపారు, రాబోయే కాలంలో ఈ సమస్యలపై ఉద్యమాలు ఉధృతం చేస్తామని తెలిపారు.

# ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయండి

**జూలూరుపాడు,నవంబర్ 18 (ప్రజా జ్యోతి )**

ఈనెల 19,20,తేదీలలో సైదాంతిక శిక్షణ తరగతులు గౌతమ్ పూర్ లో జరుగుతున్నాయని జూలూరుపాడు మండల ఏఐటీయూసీ కార్యదర్శి షేక్ చాంద్ పాషా సోమవారం ప్రకటనలో చెప్పారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాల రాస్తున్నారని కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు 25 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని గత పాలకులు పరిపాలన విధంగా కాకుండా కార్మిక వర్గానికి ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి కి గాయాలు

**జూలూరుపాడు / నవంబర్ 18 (ప్రజా జ్యోతి ):**



జూలూరుపాడు మండల కేంద్రంలో పాపకొల్లు క్రాస్ రోడ్డు వద్ద ద్వీచక్ర వాహనం తో రోడ్డు క్రాస్ చేస్తున్న ఓ వ్యక్తిని కారు ఢీ కొట్టిన సంఘటనలో వ్యక్తి కాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. తృటిలో ప్రమాదం తప్పింది .వివరాల్లోకి వెళ్తే కొత్తగూడెం వైపు నుంచి ఖమ్మం వెళుతున్న కారు టైర్ పంచర్ కావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ చెప్పటం జరిగింది.గాయపడిన వ్యక్తి పేరు మాడెం మనోజ్ (22 )తను వలస కూలీ అని చెప్పాడు,గాయపడిన వ్యక్తి ని పోలీసుల సహాయం తో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి కి తరిలించారు.

# ముక్కోటి నాటికి మ్యూజియాన్ని అందంగా ముస్తాబు చేయాలి

## –పనులు పరిశీలించిన ఐటీడీఏ ఏపీవో డేవిడ్ రాజ్





**భద్రాచలం, నవంబర్ 18 ప్రజాజ్యోతి:**

ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మ్యూజియం ముక్కోటి నాటికి పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేసి భక్తులు ఆకర్షించేలా అందంగా ముస్తాబు చేయాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్ మ్యూజియం కమిటీ సభ్యులకు సూచించారు. సోమవారం గిరిజన మ్యూజియం పనులను ఆయన కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. మ్యూజియం ప్రాంగణంలో మట్టి ఇల్లు నిర్మించే స్థలాన్ని, బోటింగ్కు సంబంధించిన చెరువును, మ్యూజియం పరిసరాలను పరిశీలించి జరుగుతున్న పనులపై ఆరాతీశారు. బోటింగ్ ఏర్పాటు కోసం ఉన్న చెరువు చుట్టూ ప్రస్తుతం ఉన్న రాళ్లతో కట్టిన గోడను సిమెంటుతో ప్లాస్టరింగ్ చేయించాలని, మ్యూజియం పరిసరాలు పిచ్చిచెట్లు, పనికిరానివి ఏమున్నా వెంటనే తొలగించాలని, ఎత్తుపల్లాల భూమి ఉంటే చదును చేయించాలని పంచాయతీ ఈవో శ్రీనివాస్కు ఆదేశించారు.మట్టి ఇల్లు పనులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు పూర్తిచేయాలని, ఏదేమైనా ఈ పనులను ముమ్మరంగా పూర్తిచేసి ముక్కోటి నాటికి మ్యూజియం ప్రాంతాన్ని సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఎంవో రమణయ్య. పంచాయతీ ఈవో శ్రీనివాస్, మ్యూజియం ఇన్చార్జ్ వీరాస్వామి, టీఏ శ్రీనివాస్లు పాల్గొన్నారు.

# వైన్ షాపు సిండికేట్ వ్యవస్థ చెప్పిందే వేదం

**సిండికేట్ వ్యవస్థకు వత్తాసు గా ఎక్సైజ్ అధికారులు.**

**ఎన్ని ధర్నాలు చేసిన, కార్యాలయం ముట్టడి చేసిన ఫలితం శున్యం**

**దినం దినం రేట్లు పెంపు పటి పాటన్నట్టు ఎక్సైజ్ అధికారులు.**



**టేకులపల్లి / నవంబర్ 18,ప్రజాజ్యోతి:**

మండలంలో సిండికేట్సే వ్యవస్థకు వత్తాసుగా ఎక్సైజ్ అధికారులు వ్యవహరిస్తున్నారని సేవ లాల్ సేన జిల్లా అధ్యక్షులు దారావత్ సురేష్ నాయక్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇల్లందు నియోజకవర్గంలోని గిరిజన మండలంలో,గ్రామంలో వైన్ సిండికేట్ వ్యవస్థ చేపిద్దే వేదం గా నడిపిస్తున్నారు.ఎక్సైజ్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు.. ఇల్లందు ఎక్సైజ్ శాఖ పరిధిలో ఉన్న సిండికేట్ వ్యవస్థ తీరు చూస్తే ముక్కు మీద వేలు వేసుకోవాల్సినా పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆరోపించారు.ఏ ఎక్సైజ్ అధికారి మమ్మల్ని ఏం చేయలేరనే ధీమా వ్యక్తం చేయడం చూస్తే ఎక్సైజ్ అధికారులు ఏమేరకు లాలూచితేనం పడ్డారో అర్ధమవుతోంది వారు ఆరోపిస్తున్నారు.మా వైన్ షాప్ లకు రావాలంటే మా పర్మిషన్ ఉండాల్సిందే,మేము చెప్పిందే వేదం ఇక్కడంతా మా రాజ్యమే అంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సిండికేట్ వ్యవస్థ దీన్ని నిజం చేస్తున్న ఇల్లందు ఎక్సైజ్ శాఖలోని కొందరు అధికారులు వారికి వంత పాడుతున్నారని వారు అన్నారు. వ్యవస్థ నిర్వాహకులు ఇచ్చే మామూళ్లకు లొంగి చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారని వారు అన్నారు. అధికారంలో ఉన్న మంత్రుల పేర్లు చెప్పి విచ్చలవిడిగా అక్రమ సిండికేట్ వ్యాపారం చేస్తున్నారని వారు ఆరోపించారు. అన్ని తెలిసిన కూడా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన మండిపడ్డారు.మేము అందరిని మేనేజ్ చేస్తున్నాం,ప్రైవేట్ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకొని, ఈ సిండికేట్ వ్యవస్థను ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా,ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి ఏజెన్సీ గ్రామాలలో, తండాలో,గూడెం వాసులకు బెల్టు షాపుల ద్వారా మద్యాన్ని విక్రయిస్తూ తండాలల్లో ,గూడెంలల్లో యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా బెల్ట్ షాపుల ద్వారా మద్యం దొరకడం వల్ల చిన్న పిల్లలు కూడా మద్యానికి అలవాటు పడి చిన్న వయసులోనే గొడవలకు,దొంగ తనానికి దిగుతూ ఒక వైపు వారి జీవితాలను సర్వనాశనం చేసుకుంటూ మరో వైపు కుటుంబ విలువలను దిగజారుస్తూ మద్యం మత్తులో జీవిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ప్రతి పక్షంలో ఉన్నప్పుడు సాక్షాత్తు రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామాలలో బెల్టు షాపులు,సిండికేట్ వ్యవస్థ లేకుండా చేస్తామని హామీ ఇచ్చివున్న ఇల్లందు ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం ముఖ్యమంత్రి చెప్పిన మాటలకు విలువ లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిండికేట్ దందా గురించి సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ సిండికేట్ వ్యవస్థకు వంత పాట పాడడం దారుణమని వారు ఆరోపించారు.సిండికేట్ వ్యవస్థ క్వార్టర్ మీద 30 నుండి 40 రూపాయలు దోచుకుంటోంది అయినా సరిపోలేదని దిన దినం మద్యం ప్రియులపై ఇంకో ఐదు రూపాయలు పెంచి 35 నుండి 45 రూపాయలు ప్రజల సొమ్మును దోచుకోవడం చూస్తే ఇల్లందు ఎక్సైజ్ శాఖ అధికారుల లాలూచితనం అర్థమవుతుందని మండిపడ్డారు.ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సిండికేట్ వ్యవస్థ,అక్రమ బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోకపోతే జిల్లా ఎక్సైజ్ కార్యాలయాన్ని సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడి వెంకటేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి లాలు నాయక్,టేకులపల్లి మండల అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్,మండల ప్రధాన కార్యదర్శి లక్ పతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు హరిప్రియకు లేదు

**ఇల్లందు / నవంబర్ 18, ప్రజాజ్యోతి:**



ఇల్లందు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియకు కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియల్, నాయకుడు పడిదల నవీన్ లు హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో ఫార్మా విలేజీని ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.ఆ క్రమంలో కొంతమంది స్థానికులను రెచ్చగొట్టి ఫార్మ విలేజి రాకుండా చేయాలని గ్రామస్తుల ముసుగులో టిఆర్ఎస్ నాయకులు పథకం రచించారని ఆరోపించారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా అక్కడికి వచ్చిన కలెక్టర్ పై దాడి చేశారన్నారు. దీంతో స్పందించిన ప్రభుత్వం కుట్ర దారులపై చర్యలు తీసుకోవడానికి సిద్ధమైందని తెలిపారు. లగచర్ల గ్రామంలో జరిగిన ఘటన ఉటంకిస్తూ హైదరాబాదులోని తెలంగాణ భవన్ లో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే హరిప్రియ అనేక ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. పలు పార్టీలు మారిన ఆమె 2018 లో కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యే ఎన్నికై తన స్వార్థం కోసం 3 నెలలలోపే అప్పటి టిఆర్ఎస్ పార్టీలో చేరిందని గుర్తు చేశారు. అనంతరం ఇల్లందు నియోజకవర్గంలో తన భర్త హరి సింగ్ నాయక్ తో కలిసి అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వారి అక్రమాలను గ్రహించిన ప్రజలు గత అసెంబ్లీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారు. అయినా పద్ధతి మార్చుకోకుండా ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అందుకే ప్రజలు పట్టం కట్టారన్నారు. పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేసి తీరుతుందన్నారు. ఎవరు కూడా రైతులను పట్టించుకోని సమయంలో కాంగ్రెస్ పార్టీ మొట్టమొదటిసారిగా అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి రుణమాఫీ చేసిన విషయాన్ని ఎవరు మర్చిపోవద్దన్నారు. మనుగడ కోసం తప్పుడు పద్ధతిలో నిరాధారమైన ఆరోపణలతో రాజకీయాలు చేయాలనుకుంటే హరిప్రియకు తగిన రీతిలో బుద్ధి చెబుతామని పేర్కొన్నారు. ప్రజా జీవితంలో మమేకమైన ఎమ్మెల్యే కోరం కనకయ్య విజయాన్ని రానున్న కాలంలో కూడా ఎవరు అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వాస్తవాలను తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ పై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో నియోజకవర్గంలో తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాసరావు, సుదర్శన్ కోరి, జాఫర్, కమల్ కోరి, శంకర్, సిరిమల్ల రాజు, గిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్టియూసి సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఖాజా గౌస్ కు ఘన సన్మానం

**ఇల్లందు, నవంబర్ 18, ప్రజాజ్యోతి:**

సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియూసి ) సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా ఆల్ ఇండియా అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు యండి. ఖాజా గౌస్ మోహినుద్దీన్ ను సోమవారం వర్క్ షాపు నందు ఘనంగా సన్మానించారు. అదేవిదంగా కొత్తగూడెంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ సంఘ జాతీయ నాయకుడు త్యాగరాజన్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి ఇల్లందు వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, సెంట్రల్ నాయకులు గోచికొండ సత్యనారాయణ, మహబూబ్, తోట వెంకటేశ్వర్లు, అన్వర్, నాయకులు భూక్యా నాగేశ్వరరావు, కంకిపాటి రామారావు, మధు, రవి నాయక్, నాగేశ్వరరావు, మేకల శంకర్ పాల్గొన్నారు.



# జాతీయస్థాయి మధిర బాలోత్సవంలో "కాసు ప్రజ్వల" ప్రతిభ








**భద్రాచలం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి ):**

రామ భక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యంలో మధిరలో జరిగిన 27వ జాతీయస్థాయి మధిర బాలోత్సవంలో నవంబర్ 15వ తేదీన జరిగిన కూచుపూడి నృత్య బృందవిభాగంలో కుమారి కాసు ప్రజ్వల ప్రతిభ చూపి ప్రత్యేక జ్యూరీ బహుమతిని గెలుచుకున్నారు. "కాసు ప్రజ్వల" గతం లో కూడాసుప్రీంకోర్ట్‌మాజీప్రధాన నాయ్యమూర్తి జస్టిస్ యన్ వి రమణ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దంపతులు చేతులు మీదుగా కూడా అవార్డులు పొందటం జరిగింది. అదే విధంగా ఎన్నో ప్రతిష్టపాక సంస్థలు నుడి "నంది అవార్డులు" పొందటం జరిగింది. జాతీయ స్థాయి ఎన్నో పురస్కారాలు ఆందుకోవటం జరిగింది. మధిర పట్టణంలో జరిగిన జాతీయ బాలోత్సవ్ కార్యక్రమంనకు విశిష్ట అతిధిగా హాజరైన తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ తరపున ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బానోత్ కళావతి భాయ్ హాజరై చిన్నారుల స్వాగత గీతంతో రామభక్త సీతాయ్య కళా పరిషత్ నిర్వహించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 27 సంవత్సరాల నుండి కళా పరిషత్ నిర్వాహకులు పెద్దలు పుతుంభక శ్రీ కృష్ణప్రసాద్, మధిర సాంస్కృతిక రథసారధి "మధిర బాబ్జ "మిగతా మిత్ర బృందం సేవలు అభినందనీయం అని ఆమె అన్నారు. అదే విధంగా చిన్న పిల్లలను ప్రోత్సహిస్తూ వారిలో దాగిఉన్న సృజనాత్మకత వెలికి తీయటం, సాంస్కృతిక కళలు ద్వారా ప్రదర్శన చేయంచటం ప్రతి మనిషికి మానసిక ఆరోగ్యం పెంపొందుతున్నది అని డా. కళావతి భాయ్ అన్నారు. అనంతరం వివిధ కళలు ప్రదర్శన చేసిన పిల్లలకు ప్రశంస పత్రాలు అంద జేసినారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు, పెద్దలు పాల్గొన్నారు.

# ముత్తంగి అలంకరణలో భద్రాద్రి రామయ్య





**భద్రాచలం టౌన్, నవంబర్ 18(ప్రజాజ్యోతి )**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామి వారు ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామునే అర్చకులు ఆలయతలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఆరాధన, సేవాకాలం, నిత్య బలిహరణం, అభిషేకం తదితర నిత్య పూజా కార్యక్రమాలు యథావిధిగా జరిపారు. అనంతరం బేడా మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై రామయ్య నిత్యకల్యాణాన్ని, కార్తీక మాసం సందర్భంగా చిత్రాకుట మండపంలో దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి వ్రతంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించరు.

**భద్రాచలంలోని అద్భుతమైన దృశ్యం...**

భద్రాచలంలోని రాముడి ఆలయం వద్ద అద్భుతమైన డ్రోన్ దృశ్యం కనువిందు చేసింది .ఓ వైపు భద్రాద్రి రాముడి ఆలయం, మరోవైపు గోదావరినది, మబ్బుల చాటు సూర్యుడు చూపరులను ఆకట్టుకుంటోంది. కాగా కార్తీకమాసాన్ని పురష్కరించుకుని భక్తులు పవిత్ర గోదావరి నది వద్ద స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించి నదీలో దీపాలు వదిలారు.

# పాదయాత్ర గా అయ్యప్ప స్వాములు


**ఆళ్ళపల్లి. నవంబర్18. ప్రజా జ్యోతి**

మండల పరిధిలోని మర్కోడు గ్రామపంచాయతీలో అయ్యప్ప మాల ధరించిన 21 మంది స్వాములు మండల పరిధిలోని రామానుజగూడెం సమీపంలో గుట్టమీద కొలువై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కాలినడకన సుమారు 8 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. తదనంతరం అక్కడ లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వాములు రణం మల్లికార్జున్, తాళ్లపల్లి రమేష్, స్వాములు మన్యం సుబ్బారావు, తాళ్లపల్లి కృష్ణాహరి, కోనేటి వీరభద్ర చారి, యాసారపు శ్రీను, లక్ష్మీ ప్రసన్న జ్యువెలరీ దయాకర్, ఈశ్వరోజు సద్గుణాచారి.



కొమరం సుధాకర్, పాయం కోటేష్, బుడిగం యాకన్న, ఆరెళ్ళ వేణు, అంబోజు నవీన్, భరత్, కిరణ్, రామ్ చరణ్, కిసారి లాలు, శివ సాయి తదితరులు పాల్గొన్నారు.

# చంటిపాప వైద్యం కోసం ఐటీడీఏ పీవో ఆర్థికసాయం



**భద్రాచలం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి ):**

పుట్టుకతోనే నిమ్ము వ్యాధితో బాధపడుతున్న చంటిపాప వైద్యం కోసం భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.25వేల ఆర్థికసాయం సోమవారం తన ఛాంబర్ లో బాధితురాలి తల్లికి చెక్కును అందజేశారు. భద్రాచలం ఏయస్ ఆర్ కాలనీకి చెందిన ఎస్.రాధ తన బిడ్డ పుట్టుకతోనే నిమ్ముతో బాధపడుతుందని ఐటీడీఏ పీవోకు విన్నవించారు. అయితే చిన్నారి వైద్యం కోసం ఈ సహాయం అందించినట్లు పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎస్వో భాస్కరన్ పాల్గొన్నారు.

# పీఎం విశ్వకర్మ యోజన శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు



**భద్రాచలం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి ):**

పీఎం విశ్వకర్మ యోజన శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్లను జిల్లా పీఎం విశ్వకర్మ యోజన జిల్లా కన్వీనర్ ఆకుల నాగేశ్వరరావు గౌడ్ సోమవారం భద్రాచలంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతివృత్తులను దేశవ్యాప్తంగా ప్రజలను ప్రోత్సాహించడంలో భాగంగా ఈ పథకం అద్భుతంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ పథకాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న చేతివృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ దేవరపల్లి వెంకటేశ్వర్లు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఫార్మా కంపెనీ ఘర్షణ లో పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

**చంద్రుగొండ, నవంబర్ 18( ప్రజా జ్యోతి ):**

వికారాబాద్ జిల్లాలోని లగ్గాచర్ల ఫార్మా కంపెనీలో జరిగిన ఘర్షణలో అమాయక గిరిజనుల పై పెట్టిన అక్రమ కేసును ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని బోర్ బంజారా రాష్ట్ర అధ్యక్షులు రవిచందర్ చౌహన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ పెద్దలు వారి సానుభూతిపరులైన అగ్రవర్ణాల లబ్ధికోసం ఫార్మా కంపెనీ పేరుతో గిరిజనుల భూములు లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఫార్మా కంపెనీలో జరిగిన దాడిలో 16 మంది గిరిజనులను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపారని వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో గిరిజన సంఘాలు ఏకమై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు రాందాస్ నాయక్, జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గాప్రసాద్ నాయక్ ,గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రఘు చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన సంఘ నాయకుల ముందస్తు అరెస్ట్



**చంద్రుగొండ, నవంబర్ 18(ప్రజా జ్యోతి ):** విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చలో లఘుచర్ల కొడంగల్ లోని గిరిజన తండా సందర్శనకు వెళుతున్న గిరిజన విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మూడు బాలాజీ నాయక్, భారతీయ గోర్ బంజారా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవిచందర్ లను పోలీసులు ముందస్తుగా సోమవారం అరెస్టు చేశారు. వారు పోలీస్ స్టేషన్లో మాట్లాడుతూ గిరిజన సంఘాల నాయకుల ఇళ్లను పోలీసులు తెలంగాణలో జిల్లాల పడుతున్నారని ఆరోపించారు అందులో భాగంగానే తమను ముందస్తుగా అరెస్టు చేశారని తెలిపారు. అరెస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన హక్కులను కాల రాయాలని చూస్తుందని విమర్శించారు.

## 20న సిపిఐ ఎం భద్రాచలం పట్టణ మహాసభ

### గడ్డం స్వామి పట్టణ కార్యదర్శి..



**భద్రాచలం టౌన్, నవంబర్ 18(ప్రజాజ్యోతి )** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ సిపిఐ ఎం భద్రాచలం పట్టణ ఎనిమిదోవ మహాసభ నవంబర్ 20న పట్టణంలోని గుప్త కన్వెన్షన్ లో జరుగుతుందని పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి తెలిపారు. సోమవారం స్థానిక చందర్రావు భవనంలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాగణంలో జరగనున్న ఈ మహాసభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మిడియం బాబురావు జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు ఏజే రమేష్ తో పాటు సీనియర్ నాయకులు యలమంచిలి రవికుమార్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగని బ్రహ్మాచారి లు హాజరవుతున్నారని అన్నారు. గడిచిన మూడు సంవత్సరాల కాలంలో పార్టీ నిర్వహించిన పోరాటాలు సాధించిన విజయాలతోపాటు ఆటుపోటులపై చర్చించి భవిష్యత్తు లో చేయవలసిన పోరాటాలను ఈ మహాసభలలో కర్తవ్యాలుగా తీసుకుంటామని అన్నారు. 300 మంది ప్రతిదులు హాజరుకానున్న ఈ మహాసభ ఉదయం తొమ్మిది గంటలకు అమరవీరుల స్థూపం వద్ద జండా ఆవిష్కరణ నిర్వహించుకుని పట్టణం లో ప్రదర్శనగా మహాసభ ప్రాంగణానికి చేరుకొని అమరవీరులకు నివాళులర్పించి మహాసభను ప్రారంభిస్తామని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగా పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు ఎర్రం శెట్టి వెంకట రామారావు పారిల్లి సంతోష్ కుమార్ నాదెండ్ల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీల మైత్రి పండుగ వేడుకలు

**ఇల్లందు టౌన్, నవంబర్ 18, ప్రజాజ్యోతి:** పట్టణంలోని ఎస్టి జాన్స్ చర్చిలో సోమవారం స్త్రీల మైత్రి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రూప్ అండ్ పాస్టరేట్ చైర్మన్ రివ్ జాన్ బాబు, రివ్ వీర మణి, ముఖ్య ప్రశాంగికులు రివ్ అర్పిత అభిజిత్, స్త్రీల మైత్రి కార్యదర్శి గుర్రం భాగ్యమ్మ, కోశాధికారి దుప్పల పుష్ప, అరుణ డారతి, తోకల మేరీ, జీవమని, కొత్తూరు సుకన్య, యాని సాగర్, స్త్రీల మైత్రి కమిటీ సభ్యులు, భక్తి శ్రద్ధలతో పండుగను నిర్వహించారు.



# భద్రాద్రిలో కార్తీక శోభ...



### –శివాలయంలో వైభవంగా పుష్పాంజలి సేవ



**భద్రాచలం టౌన్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి ):** భద్రాచలం పట్టణంలో కార్తీకశోభ సంతరించుకుంది. కార్తీకమాసం సందర్భంగా సోమవారం భక్తులు పవిత్ర గోదావరి నదివద్దకు పెద్ద ఎత్తున చేరుకుని నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం నది ఒడ్డున కార్తీక దీపాలు వెలిగించడంతో పాటు నదిలో కార్తీక దీపాలను మహిళలు వదిలి భక్తిని చాటుకున్నారు. అనంతరం శ్రీసీతారామచంద్రస్వామి అనుబంధ ఆలయమైన శివాలయానికి చేరుకుని అక్కడ స్వామివారికి పూజలు నిర్వహించి అనంతరం కార్తీక దీపాలను ఆలయ ఆవరణలో వెలిగించారు.

**శివాలయంలో వైభవంగా పుష్పాంజలి సేవ...**

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి అనుబంధ ఆలయమైన శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి(శివాలయం) ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆలయంలో స్వామివారికి పుష్పాంజలి సేవను నిర్వహించగా ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. తొలుత స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అనంతరం పుష్పాలతో సేవ నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయం ముందు గోదావరి నదికి ప్రత్యేక హారతిని అర్చకులు చూపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవోరమాదేవి, ఈఈ రవీంద్రనాథ్, ఏవో భవానీ కృష్ణ, ఏఈవో శ్రావణ్ కుమార్ , ఆలయ సూపరింటెండెంట్ సాయిబాబా, అర్చకులు పాల్గొన్నారు.

# వివాహిత ఆత్మహత్య



**ఆళ్ళపల్లి. నవంబర్18. ప్రజా జ్యోతి** ఆర్థిక ఇబ్బందులు తాళలేఖ ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆళ్లపల్లి మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై రతీష్ తెలిపిన వివరాల ప్రకారం.మండల పరిధి మర్కోడు గ్రామానికి చెందిన జల్లారపు సాగరిక భర్త జల్లారపు రంజిత్ వీరికి 11 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది వీరి సొంత ఊరు అనిసెట్టిపల్లి గ్రామం. కూలి పని నిమిత్తం తల్లి గారి ఊరైన మర్కోడు గ్రామంలో గత ఎనిమిది సంవత్సరాలుగా ఇక్కడే కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెక్క అదితే గానీ డొక్కాడని కుటుంబం ప్రతిరోజు కూలీ కి వెళ్తే గాని రోజు గడవదు .ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న ఫ్యాన్ కి ఉరి వేసుకొని సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది. స్థానిక ఎస్సై ఘటన స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఒక కుమారుడు ఒక కుమార్తె ఉంది.

# గనులలో అనుమతించబడిన పేలుడు పదార్థాల వినియోగంపై అవగాహన సదస్సు

**కొత్తగూడెం సింగరేణి / 18నవంబర్ (ప్రజాజ్యోతి ):** గనులలో అనుమతించబడిన పేలుడు పదార్థాల వినియోగం పై అవగాహన సదస్సు" నిర్వహించారు.సోమవారం కొత్తగూడెం ఏరియా ఆర్.సి.ఓ.ఎ క్లబ్ నందు ఉమేష్ ఎం సావర్కర్ , డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ సౌత్ సెంట్రల్ జోన్ సనత్ కుమార్, DDMS మరియు కమలేష్ కుమార్ వర్మ, DDMS గారి ఆధ్వర్యంలో ఎం. షాలేం రాజు, జనరల్ మేనేజర్, కొత్తగూడెం ఏరియా గారి అధ్యక్షతన కొత్తగూడెం ఏరియా అధికారులకు , సుపర్వైజర్లకు ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి ,విశిష్ట అతిథులచే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బొగ్గు గనులలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో తమ అమూల్యమైన ప్రాణాలను కోల్పోయిన ఉద్యోగులకు 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అదే విధంగా అందరితో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు . ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉమేష్ ఎం సావర్కర్ గారు మాట్లాడుతూ... అనుమతించబడిన పేలుడు పదార్థాలు మరియు డిటోనేటర్ల నాణ్యత, భద్రత మరియు పని తీరు లక్షణాలకు అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తరువాతనే పేలుడు పదార్థాలను ఉపయోగించుకోవాలని సూచనలు చేశారు. బ్లాస్టింగ్ సమయంలో రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాదం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్లాస్టింగ్ విధులు నిర్వహించు ఉద్యోగులు సిస్టమాటిక్ ఆపరేషన్ ప్రొసీజర్ (SOP) తప్పకుండా పాటించవలసినదిగా కోరడమైనది. బ్లాస్టింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులు మరియు కాంట్రాక్ట్ కార్మికులకు సరియైన శిక్షణ ఇవ్వవలసినదిగా కోరడమైనది. బ్లాస్టింగ్ నిర్వాహణలో సూపర్వైజర్ పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుంది. బ్లాస్టింగ్ సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా తగు నివారణ చర్యలు తీసుకోవలసిందిగా సూచనలు చేశారు. అనంతరం ఎం.షాలేం రాజు గారు, ఏరియా జనరల్ మేనేజర్, కొత్తగూడెం ఏరియా గారు మాట్లాడుతూ.. సింగరేణి నందు డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ వారిచే ఆమోదించబడిన పేలుడు పదార్థాలు , డిటోనేటర్లను బొగ్గు బ్లాస్టింగ్ చేయడం కొరకు ఉపయోగించడం జరుగుతుందన్నారు. ఉత్పత్తి ఉత్పాదకతతో పాటు రక్షణ పట్ల పని ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రమాదరహిత ఉత్పత్తి కొరకు పటిష్టంగా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందిని తెలిపారు. తద్వారా కొత్తగూడెం ఏరియా లో ప్రమాదములను పూర్తిగా నివారించడం జరుగుతుంది. యాజమాన్యము అన్ని రకాల రక్షణ చర్యలు తీసుకున్నప్పటికీ వ్యక్తిగతంగా గాని, భౌగోళికంగా గాని, ఏదైనా ప్రమాదం జరిగే సూచనలు ఉంటే దానిని ముందుగానే పసిగట్టి అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత క్షేత్రస్థాయిలో పనిచేసే వర్క్ ఇన్స్పెక్టర్లు మరియు సూపర్వైజర్ల పై ఎంతో బాధ్యత ఉంటుంది కాబట్టి వారు పని ప్రదేశాలలో పనిచేసే కార్మికులకు ఎప్పటికప్పుడు రక్షణ పాటించవలసిన ఆవశ్యకతపై తగు సూచనలు చేస్తూ ఉండాలని సూచించారు. అనంతరం ఏఐటియుసి యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ వి మల్లికార్జున రావు ,ఐఎన్ టి యూ సి యూనియన్ నాయకులు ఎండి.రజాక్ మాట్లాడుతూ ఉత్పత్తి ఉత్పాదకతతో పాటు కార్మికుల రక్షణ, సంక్షేమం, ఆరోగ్యం పట్ల ఏరియాలో అనేక కార్యక్రమాలు కొనసాగుతూ ఉండటం సంతోషకరము. యూనియన్ ప్రతినిధులమైన మా సూచనలను పరిగణలోకి తీసుకొని సత్వర పరిష్కారాలు ఏరియా జిఎం చర్యలు చెబడుతున్నారు. కాబట్టి ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణ మరియు పారిశ్రామిక ప్రశాంతతతో తన ప్రత్యేకతను చాటుకోవడం ఎంతో సంతోషదాయకం అని ప్రశంసించారు. CMOAI బ్రాంచ్ సెక్రటరీ కొత్తగూడెం ఏరియా ఏ ఉపేందర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిలో రక్షణ చర్యలు తీసుకోవడం ఎంతో అభినందనీయమని తెలియజేశారు. ఈ సందర్భంగా ఏరియా రక్షణ అధికారి ఎం వెంకటేశ్వర రావుచే పేలుడు పదార్థాల వినియోగంపై మరియు వాటి ప్రమాదాల నివారణ కొరకు తీసుకుంటున్న రక్షణ చర్యలు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంల కే. జీ తివారి గారు జిఎం సేఫ్టీ కొత్తగూడెం రీజియన్, ఎస్ఓటు జిఎం జీవీ కోటిరెడ్డి, ఇంచార్జ్ ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణ రాజు, ఏజెంట్ బి రవీందర్, పి ఓలు – రమేష్, ప్రహ్లాద్, ఏరియా రక్షణ అధికారి ఎం వెంకటేశ్వరరావు, డీజీఎం (పర్సనల్ ) బి శివ కేశవ రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి వి.శ్రీనివాస్గా అన్ని గనుల మేనేజర్లు, సేఫ్టీ అధికారులు తదితర ఉన్నత అధికారులు, అధికారులు, సుపర్వైజర్లు, ఆఫ్ లోడింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

